సాక్షి ఆదిలాబాద్

శనివారం । 26 । అక్టోబర్ । 2024

28న జోనల్‌స్థాయి స్విమ్మింగ్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 28న స్థాని క ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో అండర్-14,17 జోనల్‌స్థాయి బాలబాలికల స్విమ్మింగ్ ఎంపి క పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాం తారావు ప్రకటనలో తెలిపారు. అర్హులైన క్రీడాకారు లు వయస్సు ధ్రువీకరణపత్రం, బోనఫైడ్‌తో ఉద యం 9 గంటలకు పోటీల కన్వీనర్ రాష్ట్రపాల్‌కు రిపోర్ట్ చేయాలని సూచించారు. వివరాలకు 77020 35200 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

తేమ.. తంటా

- ధర కోసం రోడ్డెక్కిన రైతులు
- వేలం ద్వారా నిర్ణయించినా ముందుకు సాగని కొనుగోళ్లు
- సీసీఐ అధికారులు, వ్యాపారులతో కలెక్టర్ పలుమార్లు చర్చలు
- అయినా తొలగని ప్రతిష్టంభన
- రాత్రి వరకు కొనసాగిన రైతుల రాస్తారోకో
- చివరకు రూ.6,696తో కొనుగోలుకు ముందుకొచ్చిన ప్రైవేట్ వ్యాపారులు



కొనుగోళ్లు షురూ కాకపోవడంతో రాత్రి వరకు మార్కెట్ యార్డులో నిలిచిన వాహనాలు

ఆదిలాబాద్‌టౌన్: ఆరుగాలం శ్రమించి పత్తి పంటను విక్రయించేందుకు మార్కెట్ యార్డుకు తీసుకొచ్చిన రైతులకు తిప్పలు తప్పలేదు.. మద్దతు ధర లభిస్తుందనుకున్న వారికి తొలిరోజు నిరాశే ఎదురైంది.. తేమ పేరిట ధరలో కోత విధిస్తామని సీసీఐ అధికారులు, ప్రైవేట్ వ్యాపారులు ప్రకటించడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.. వారి తీరును నిరసిస్తూ రోడ్డెక్కారు.. మొదటి రోజు కొనుగోలు ప్రక్రియ జరగలేదు. కలెక్టర్ రాజర్షిషా పలుమార్లు సీసీఐ అధికారులు, ప్రైవేట్ వ్యాపారులతో చర్చలు జరిపినప్పటికీ సఫలీకృతం కాలేదు. ఉదయం నుంచి రైతుల ఆందోళన కొనసాగడంతో రాత్రి 8 గంటల ప్రాంతంలో కలెక్టర్ ప్రైవేట్ వ్యాపారులను ఒప్పించి మొదటి రోజు తీసుకొచ్చిన పత్తి బండ్లకు తేమతో సంబంధం లేకుండా క్వింటాలుకు రూ.6,696తో కొనుగోలు చేసేలా చూశారు. అయితే రాత్రి కావడంతో కొనుగోళ్లు జరపలేదు. ఈ నిర్ణయానికి కొంత మంది రైతులు ఒప్పుకోగా, మరికొంత మంది ససేమిరా అన్నారు.

వేలంతో ధర నిర్ణయించినా.. మొదలుకాని కొనుగోళ్లు

ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉదయం 10 గంటల సమయంలో సీసీఐ అధికారులతో పాటు ప్రైవేట్ వ్యాపారులు పత్తి కొనుగోలుకు ముందుకొచ్చారు. మొదట సీసీఐ అధికారులు మద్దతు ధర రూ.7,521తో ప్రారంభించారు. ఆ తర్వాత ప్రైవేట్ వ్యాపారులు తొలుత రూ.6700తో ధర ప్రారంభించి రూ.10, రూ.20 పెంచుతూ వచ్చారు. చివరకు రూ.7,100 వద్ద ఆగారు. అంతకుమించి పెంచేందుకు ససేమిరా అన్నారు. దీంతో ఒక్కసారిగా రైతులు ఆగ్రహానికి గురయ్యారు. ధర పెంచాలని పట్టుబట్టారు. దీంతో మరో రూ.50 పెంచి రూ.7,150తో కొనుగోలు చేసేందుకు ఒప్పుకున్నారు. అయినప్పటికీ రైతులు విక్రయించేందుకు నిరాకరించారు. ఒకటవ కాంటా వద్ద కలెక్టర్ రాజర్షిషా,



వేలం ద్వారా పత్తి ధర నిర్ణయిస్తున్న అధికారులు

అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పూజలు చేసి కొనుగోళ్లను ప్రారంభించారు. మొదటి పత్తి వాహనంలో తేమ శాతాన్ని మూడుసార్లు పరిశీలించగా.. 19 శాతం, 27 శాతం, 50 శాతం వచ్చింది. పలు వాహనాల్లో చూసినప్పటికీ 8 నుంచి 12 శాతం కంటే ఎక్కువగా ఉండడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. సీసీఐ నిబంధనల ప్రకారం 8 నుంచి 12 శాతం తేమ ఉంటేనే కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. 12 శాతం దాటితే కొనుగోలు చేయమని పేర్కొన్నారు. 9 శాతం తేమ ఉంటే రూ.74.45, 10 శాతం ఉంటే రూ.73.70, 11శాతం ఉంటే రూ.72.95, 12శాతం ఉంటే రూ.72.20తో కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. సీసీఐ మాదిరిగానే తాము కూడా 12శాతం తేమ దాటితే కొనుగోలు చేయమని ప్రైవేట్ వ్యాపారులు చెప్పుకొచ్చారు. అయితే ప్రైవేట్ వ్యాపారులు కనీసం మద్దతు ధరకు కూడా కొనుగోలు చేయడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ కొనుగోళ్లు ప్రారంభించినా ప్రక్రియ ముందుకు సాగలేదు. రైతులకు నచ్చజెప్పినా వినిపించుకోలేదు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ తతంగం సాగింది.

పలుమార్లు చర్చలు..

పత్తి ధర విషయంలో సీసీఐ అధికారులు, ప్రైవేట్ వ్యాపారులతో కలెక్టర్ పలుమార్లు చర్చలు జరిపారు. అయితే వారు ఎంత చెప్పినా ఒప్పుకోకుండా నిబంధనల ప్రకారమే కొనుగోలు చేస్తామని భీష్మించుకు కూర్చున్నారు. మరోవైపు తేమతో సంబంధం లేకుండా పంట కొనుగోలు చేయాలని రైతులు పట్టుబట్టారు. ధర విషయంలో వెనుకంజ వేయడంతో గంటల తరబడి ప్రక్రియ నిలిచిపోయింది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో ప్రైవేట్ వ్యాపారులను కలెక్టర్ ఒప్పించి మరో రూ.50 పెంచి రూ.7,200లతో కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టారు. అయినప్పటికీ అన్నదాతలు ఆ ధరకు విక్రయించేందుకు ససేమిరా అన్నారు. కలెక్టర్‌తో పాటు ఎస్పీ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, మార్కెటింగ్ జేడీ శ్రీనివాస్, ఏడీ గజానంద్, ఆదిలాబాద్ మార్కెట్ కార్యదర్శి మధుకర్ చర్చల్లో పాల్గొన్నారు.

రోడ్డెక్కిన రైతులు



ఆందోళన చేస్తున్న రైతులు

తేమ విషయం ఎటూ తేలకపోవడంతో రైతులు రోడ్డెక్కారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో మార్కెట్ యార్డు ఎదుట ఆందోళన చేపట్టారు. ఆ తర్వాత రోడ్డుపై బైఠాయించారు. అక్కడినుంచి పంజాబ్ చౌక్ వరకు వెళ్లి జాతీయ రహదారిపై నిరసన చేపట్టారు. రాత్రి 8 గంటల వరకు రైతులు ఆందోళన చేపట్టడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తేమతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని పట్టుబట్టారు. తమకు న్యాయం జరిగేంత వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంతో పాటు పలు మండలాల రైతులు పత్తిని మార్కెట్‌కు తీసుకొచ్చారు. 500 వాహనాలు మార్కెట్‌కు వచ్చాయి. ఉదయం మార్కెట్‌కు వచ్చిన రైతులు అక్కడినుంచి ఎటు కదలకుండా, తిండి తిప్పలు లేకుండా ఆందోళన బాట పట్టారు.

కలెక్టర్‌ను చుట్టుముట్టి..

ధర విషయంలో ఎటూ తేలకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. సీసీఐ అధికారులు, వ్యాపారులతో చర్చల అనంతరం కలెక్టర్ తన వాహనంలో బయల్దేరుతుండగా రైతులు ఘెరావ్ చేశారు. కలెక్టర్ వాహనాన్ని చుట్టుముట్టి అడ్డుకున్నారు. ధర విషయం తేల్చాకే వెళ్లాలని పట్టుబట్టారు. ఓ దశలో కలెక్టర్ కాళ్లపై పడి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. కొంత మంది రైతులు కాంటాపై బైఠాయించారు. దీంతో మధ్యాహ్నం 2 గంటల తర్వాత కలెక్టర్ మరోసారి సీసీఐ అధికారులు, ప్రైవేట్ వ్యాపారులతో చర్చలు జరిపారు. రాత్రి 8 గంటల వరకు సమావేశమై



కలెక్టర్ వాహనాన్ని అడ్డుకుంటున్న రైతులు

ప్రైవేట్ వ్యాపారులను ఒప్పించారు. తీరా ప్రైవేట్ వ్యాపారులు ఒక్కడుగు వెనక్కి వేసి చివరకు రూ.6,696తో కొనుగోలు చేసేందుకు ఒప్పుకున్నారు. అయితే మొదటి రోజు వచ్చిన పత్తి బండ్లను మాత్రమే తేమతో సంబంధం లేకుండా కొనుగోలు చేస్తామని స్ప ష్టం చేశారు. కాగా మొదటి రోజు వచ్చిన దా దాపు 500 పత్తి వాహనాలకు టోకెన్లు అందజేశారు. ఇదిలా ఉండగా ఈ వాహనాల పత్తిని శనివారం కొనుగోలు చేయనున్నట్లు మార్కెటింగ్ ఏడీ గజానంద్ తెలిపారు. ఇదిలా ఉండగా ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కలెక్టర్ మార్కెట్ యార్డులోనే ఉన్నారు. రాత్రి సమయంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అక్కడికి చేరుకున్నా రు. సీసీఐ అధికారులు, ప్రైవేట్ వ్యాపారులతో మాట్లాడారు. రైతులకు న్యాయం చేసేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

'గుస్సాడీ' గుండె ఆగింది



దండారీ ఆడుతున్న కనకరాజు(ఫైల్)

- ఆదివాసీ కళను దేశవ్యాప్తం చేసిన కనక రాజు
- ఇందిరా గాంధీ హయాంలో ఢిల్లీలో ప్రదర్శన
- స్వగ్రామంలో వేలాది మందికి ఉచిత శిక్షణ
- 'పద్మశ్రీ'తో సత్కరించిన కేంద్ర ప్రభుత్వం
- అనారోగ్యంతో మార్లవాయిలో కన్నుమూత

కెరమెరి(ఆసిఫాబాద్): ఆయన పాదం కదిపితే 'గిరి' గూడెం చిందేస్తుంది. ఆయన ఆడితే గిరిజనమంతా కాలుకదుపుతారు. ఆయన గజ్జ కడితే వేడుక ఏదైనా సందడే. అంతరించిపోతున్న ఆదివాసీ నృత్యానికి ప్రాణం పోసిన కళాపోషకుడు. నృత్యం పేరునే తన ఇంటి పేరుగా మార్చుకుని, జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చిన కళా సార్వభౌముడు గుస్సాడీ కనకరాజు(83). తన కళను ముందు తరాలకు అందించాలనే సంకల్పంతో వేలాది మందికి ఉచితంగా శిక్షణ అందించారు. ఆదివాసీ కళను జాతీయ, అంతర్జాతీయస్థాయికి తీసుకెళ్లి గుస్సాడీ రాజుగా కీర్తి గడించారు. చివరి శ్వాస వరకు కళా పోషణలో ఉన్న పద్మశ్రీ అవార్డు గ్రహీత కనకరాజు శుక్రవారం కన్నుమూశారు. కొన్ని రోజులుగా అస్తమాతో బాధపడుతున్న ఆయన ఇంటి వద్దనే తుది శ్వాస విడిచాడు. దండారీ ఉత్సవాలు ప్రారంభం అవుతున్న వేళ.. గుస్సాడీ గుండె చప్పుడు ఆగిపోవడంతో ఉమ్మడి జిల్లా అంతా విషాదం నెలకొంది.

మార్లవాయిలో జననం

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం మార్లవాయిలో పేద కుటుంబంలో రాము, రాజుబాయి దంపతులకు 1941లో కనక రాజు జన్మించారు. చిన్నతనం నుంచే ఆయన చురుగ్గా సాంస్కృతిక కార్యక్రమాల్లో పాలుపంచుకునేవారు. మానవ పరిణామ శాస్త్రవేత్త ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్, బెట్టి దంపతులు మార్లవాయిలోనే ఉండేవారు. చిన్నతనంలో కనకరాజు వారి వద్దే ఎక్కువ సమయం గడిపేవారు. కనక రాజుకు ఇద్దరు భార్యలు భీంబాయి, పార్వతీబాయి. ముగ్గురు కుమారులు రాము, తుకారాం, జుగాదిరావుతోపాటు ఎనిమిది మంది కుమార్తెలు



రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు అందుకుంటున్న కనకరాజు(ఫైల్)

ఉన్నారు. కనకరాజుకు చిన్నతనం నుంచి దీపావళి పర్వదినం సందర్భంగా ప్రారంభమయ్యే గుస్సాడీ ఉత్సవాల్లో పాల్గొనేవారు. దండారీల వెంట తిరుగుతూ గడిపేవారు. మొదట ఆయన మార్లవాయిలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో రోజువారీగా కూలీగా విధులు నిర్వర్తించేరు. అలాగే నార్నూర్ మండలం జాముడా, సిర్పూర్ (యూ) మండలం కోహినూర్, ఉట్నూర్, మార్లవాయిల్లో దినసరి కూలీగా పనిచేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చెప్పే పనులు చేస్తూనే అనేక ప్రాంతాలకు వెళ్లి యువకులకు గుస్సాడీ నృత్యంపై శిక్షణ అందించేవాడు.

35 మందికి టీం లీడర్..

ఆదివాసీ ఐఏఎస్ అధికారి తుకారాం 1981 ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో గుస్సాడీ శిక్షణ తరగతులు నిర్వహించారు. 150 మంది శిక్షణ పొందగా వారిలో కనక రాజు కూడా ఒకరు. శిక్షణలో ఉన్న 150 మందిలో 35 మందిని ఢిల్లీ ప్రదర్శనకు ఎంపిక చేశారు. ఈ టీంకు లీడర్‌గా కనక రాజు వ్యవహరించారు. ఢిల్లీలో ప్రదర్శన ఇచ్చిన స్ఫూర్తితో అనేక మందికి శిక్షణ ఇచ్చారు. ఇప్పటికీ ఆయనకు 30 మంది శిష్యులు ఉన్నారు. వారిలో 20 మంది మార్లవాయిలో ఉండగా.. 10 మంది కోహినూర్ గ్రామంలో ఉన్నారు.

ఢిల్లీలో ప్రదర్శనలు

1981లో ఢిల్లీలోని ఎర్రకోట వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో కనకరాజు బృందం ప్రదర్శించిన గుస్సాడీ నృత్యం అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ తిలకించి ముగ్దులయ్యారు. ప్రదర్శన అనంతరం స్వయంగా కనకరాజు పలకరించారు. తనకు నృత్యం నేర్పించాలని కోరారు. దీంతో కనక రాజు ప్రధానికి స్వయంగా నెమలి పింఛం టోపిని అలంకరించి కాళ్లకు గజ్జెలు కట్టారు. గుస్సాడీ వేషధారణలో నృత్యం చేయించారు. ఆ తర్వాత 2014లో నాటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఎదుట రెండోసారి ఢిల్లీలో గుస్సాడీ నృత్య ప్రదర్శన ఇచ్చారు. రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. కనకరాజు సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2021 నవంబర్ 9న పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది.

న్యూస్‌రీల్

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి

నేరడిగొండ: విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనతో పాటు హాజరుశాతం పెంచాలని డీఐఈవో రవీంద్రకుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో మాట్లాడారు. విద్యార్థుల హాజరుశాతం పెంచడంతో పాటు వారిని పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ శబాన తరన్నుమ్, లెక్చరర్లు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

బజార్‌హత్నూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు చేపడుతున్నామని డీఈవో ప్రణీత తెలిపారు. మండలంలోని అనంతపూర్, బజార్‌హత్నూర్‌లోని కేజీబీవీ, జెడ్పీఎస్ఎస్, గిర్నూర్, పిప్రి ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులతో పాటు మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. ప్రైవేటుకు దీటుగా విద్యనందించి ఉత్తమ ఫలితాలు రాబట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆమె వెంట సీఎంవో సుజత్‌ఖాన్, రాజేశ్వర్, ప్రధానోపాధ్యాయులు భూమన్న, లక్ష్మీ, సదానందం, ఉపాధ్యాయులు ఉన్నారు.

గిరిజన చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నైతం బాలు అన్నారు. ఈ మేరకు ఎంపీడీవో జవహర్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 1/70 చట్టం ప్రకారం ఏజెన్సీ ఏరియాలో గిరిజనేతరులకు స్థిర నివాసం, ఇళ్ల నిర్మాణాలు, వ్యాపారంతో పాటు ఎలాంటి కార్యకలాపాలకు అనుమతి లేదన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ఉద్యోగులు గిరిజన చట్టాలకు లోబడి పని చేయాలన్నారు.

ఔడా..

- ఆదిలాబాద్ పట్టణాభివృద్ధి సంస్థ ఏర్పాటు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- పరిధిలోకి 107 గ్రామాలు
- అభివృద్ధి ఇక వేగవంతం

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలను కలిపి ఆదిలాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఔడా)గా ఏర్పాటైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ఇటీవల ప్రతిపాదనలు పంపగా, వాటికి సర్కారు ఆమోదముద్ర వేసింది. ఆదిలాబాద్ మున్సిపాలిటీతో పాటు ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లోని ఆరు మండలాల్లో గల 107 గ్రామాలతో కూడిన ఔడాను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం.దానకిషోర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫలితంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక నిధులు మంజూరై అభివృద్ధి వేగవంతమయ్యే ఆస్కారం ఉంది.



ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు ప్రతి

ఔడా పరిధి ఇలా..

ఆదిలాబాద్ మున్సిపాలిటీతో పాటు 107 గ్రామాలతో ఔడా పరిధి విస్తరించనుంది. ఆదిలాబాద్‌రూరల్ మండలంలో అర్లి(బి), భీంసరి, చాందా(టి), దిమ్మ, గణేష్‌పూర్, జందాపూర్, కచ్‌కంటి, కుంభఝరి, లాండసాంగ్వి, మల్లాపూర్(డి), నిషాన్ ఘాట్, పొచ్చర, రామాయి, రాంపూర్, బేల మండలంలోని టాక్లి, సిర్సన్న, అవాల్‌పూర్, బేల, బెదోడ, భాది, దటల్‌పూర్, దహెగాం, డొప్టాల, గూడ, కంగార్‌పూర్, మణియార్‌పూర్, మొహబత్‌పూర్, నారాయణ్‌పూర్, పాఠన్, సాంగిడి, శంషాబాద్, భీంపూర్ మండలంలో నిపాని, పిప్పల్‌కోటి, తాంసి(కె), వడ్‌గాం, జైనథ్ మండలంలోని తరోడా, అడ, ఆకోలి, ఆకుర్ల, బహదూర్‌పూర్, బాలపూర్, బెల్లూరి, బెల్గాం, భోరజ్, దాదాపూర్, దీపాయిగూడ, డొల్లారా, పొజ్‌పూర్, గిమ్మకుర్దు, గిమ్మబురుజ్, గూడ, హరియాలి, హశంపూర్, హత్తిఘాట్, జైనథ్, కామాయి, కంఠ, ఖాప్రి, కరంజి, కరన్‌వాడి, కేదార్‌పూర్, కౌట, కోర్టా, కూర, లక్ష్మీపూర్, లేఖర్‌వాడి, మాకోడ, మాండగడ, మిర్జాపూర్, ముక్తాపూర్, నిరాల, నిజాంపూర్, పెండల్‌వాడ, పిప్పల్‌గావ్, పిప్పర్‌వాడ, పూసాయి, రాంపూర్(టి), సాంగ్వి, సావాపూర్, సేకపూర్, ఉమ్రి, మావల మండలంలోని బట్టిసావర్గాం, మావల, తలమడుగు మండలంలోని దేవాపూర్, కజ్జర్ల, ఖోడద్, కొత్తూర్, లచ్చంపూర్, పల్లి(బి), పల్లి(కె), సుంకిడి, తలమడుగు, ఉండం మండలాలను కలిపారు. అలాగే తాంసి మండలంలోని బండల్ నాగాపూర్, ఘోట్కురి, హస్నాపూర్, జామిడి, కప్పర్ల, పాలోది, పొన్నారి, సవర్గాం, తాంసి(బి), వడ్డాడి గ్రామాలతో ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో పాలకవర్గాలు యథావిధిగా ఉండే అవకాశం ఉన్నప్పటికీ అనుమతులు మాత్రం ఇక నుంచి ఔడా ద్వారానే జరగనున్నాయి.

కార్యకలాపాల కోసం కమిటీ..

ఔడా కార్యకలాపాల నిర్వహణ, అభివృద్ధి పనులు చేపట్టేందుకు, వివిధ అనుమతుల మంజూరుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించింది. చైర్మన్‌గా కలెక్టర్, వైస్‌చైర్‌పర్సన్‌గా లోకల్‌బాడీస్ అదనపు కలెక్టర్ వ్యవహరించనుండగా, సభ్యులుగా ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ/ప్రిన్సిపల్ సెక్రెటరీ, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ సభ్యులుగా ఉంటారు. లేకుంటే వారు నామినేట్ చేసిన వ్యక్తులు ఉండనున్నారు. ఈ సంస్థకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నేరుగా నిధులు మంజూరవుతాయి. రహదారుల నిర్మాణం, డ్రెయినేజీలు, డివైడర్ల ఏర్పాటు, సెంట్రల్ లైటింగ్ కోసం నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. సంస్థ పరిధిలోని గ్రామాల్లో జీ+5 వరకు భవనాల నిర్మాణానికి అనుమతులు ఇచ్చే అధికారం సంస్థకు ఉంది. పరిశ్రమల ఏర్పాట్లు, లేఅవుట్లకు అనుమతులు కూడా ఈ సంస్థ ద్వారానే జారీ కానున్నాయి.

బల్దియాను సందర్శించిన సివిల్ సర్వీసెస్ అధికారులు



సివిల్ సర్వీసెస్ అధికారులతో బల్దియా అధికారులు, సిబ్బంది

- నేటి నుంచి వార్డుల్లో పర్యటన

కైలాస్‌నగర్: క్షేత్రస్థాయి శిక్షణ నిమిత్తం జిల్లాకు విచ్చేసిన 21మంది సివిల్ సర్వీసెస్ అధికారులు శుక్రవారం ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. డీఈ తిరుపతి ఆధ్వర్యంలో అధికారులు, ఉద్యోగులు వారికి స్వా గతం పలికారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ము న్సిపల్ ద్వారా అమలు చేసే ప్రభుత్వ పథకాలు, ప్రజలకు అందిస్తున్న సేవలను ఆయా విభాగాల హెచ్‌వోడీలు వివరించారు. అనంతరం వారితో గ్రూప్ ఫొటో దిగారు. కాగా శనివారం, ఆదివారం పట్టణంలోని నాలుగు వార్డుల్లో బృందాలుగా సదరు అధికారులు పర్యటించి పథకాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, రెవెన్యూ అధికారి జాదవ్ కృష్ణ, మెప్మా డీఎంసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ఓపెన్‌హౌస్ విజయవంతం

- ఎస్పీ గౌస్ ఆలం
- వీక్షించిన 75 పాఠశాలల విద్యార్థులు
- ఆయుధాల పనితీరుపై అవగాహన

ఆదిలాబాద్‌టౌన్: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ సందర్భంగా స్థానిక హెడ్‌క్వార్టర్స్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన ఆన్‌లైన్ ఓపెన్‌హౌస్ కార్యక్రమం విజయవంతమైందని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. పోలీసుల విధులపై అవగాహన కల్పించడంతో పాటు ఆయుధాలు, బాంబుస్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌ల పనితీరును విద్యార్థులకు వివరించినట్లు తెలిపారు. అత్యవసర సమయంలో డయల్ 100, సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నం.1930కు సమాచారం అందించి సాయం పొందవచ్చని సూచించారు. మహిళలు, ఆడపిల్లలకు అత్యవసర సమయంలో జిల్లాలో రెండు షీ టీమ్‌లు నిరంతరం విధులు నిర్వర్తిస్తుంటాయని తెలిపారు. ప్రతీ కళాశాల, పాఠశాలల్లో యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి. సురేందర్‌రావు, డీఎస్పీలు బి.సురేందర్‌రెడ్డి, సైబర్ క్రైమ్ డీఎస్పీ హసీబుల్లా, సీఐ డీసీఆర్బీ బి.ప్రసాద్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డి.వెంకటి, టి.మురళి, చంద్రశేఖర్, కార్తీక్, కమ్యూనికేషన్ ఎస్సై బి.గణేశ్, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, రిజర్వ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆయుధాల పనితీరును ఆన్‌లైన్ ద్వారా వివరిస్తూ..

అమరుల త్యాగాలు చిరస్మరణీయం

పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. సంస్మరణ వారోత్సవాల సందర్భంగా స్థానిక పోలీస్ హెడ్‌క్వార్టర్స్ వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రజలకు తెలియజేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని అన్నారు. కలెక్టర్ చౌక్, ఎన్టీఆర్ చౌక్, వినాయక్ చౌక్, దేవిచంద్ చౌక్, గాంధీ చౌక్, అంబేద్కర్‌చౌక్, నేతాజీ చౌక్, బసవేశ్వర చౌక్, బస్టాండ్ మీదుగా కొనసాగిన ర్యాలీ స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ ప్రాంగణం వద్ద ముగిసింది. జిల్లా పోలీసులు, రెండో బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులు సత్వరమే పరిష్కరించాలి

- ఎస్పీ గౌస్ ఆలం

కైలాస్‌నగర్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ గౌస్ ఆలం ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల వారీగా నమోదైన అట్రాసిటీ కేసులు, వాటి ప్రగతిపై ఎస్పీ సమీక్షించారు. ఎస్‌హెచ్‌వోలు, సీఐలు కేసుల ప్రగతి వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఈ ఏడాది జిల్లాలో 32 కేసులు నమోదయ్యాయని, అందులో 11 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మాన్యువల్ స్కావెంజర్ యాక్ట్ -2013 గురించి కమిటీ సభ్యులకు వివరించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ.. అట్రాసిటీ చట్టంపై ప్రజలకు గ్రామస్థాయి నుంచి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, డీఎస్సీడీవో సునీత కుమారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్ రావు, డీపీవో శ్రీలత, పీపీలు, కమిటీ సభ్యులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ గౌస్ ఆలం

క్లుప్తంగా

డీజే పరికరాల చోరీ



దుకాణం షట్టర్‌ను పగులగొట్టిన దొంగలు

నిర్మల్ రూరల్: మండలంలోని చిట్యాల గ్రామంలో గురువారం అర్ధరాత్రి ఓ డీజే సెంటర్‌లో దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన ఆరే రాకేశ్ కొన్ని రోజులుగా డీజే నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నాడు. గురువారం అర్ధరాత్రి షట్టర్ పగలగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు అందులో ఉన్న ఆరు ఎంప్లిఫయర్లు, ఇతర సామగ్రి ఎత్తుకెళ్లారు. ఉదయం గ్రామస్తులు పరిశీలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రూరల్ ఎస్సై లింబాద్రి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దొంగిలించిన వస్తువుల విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడి చేసుకున్న భార్యాభర్తలపై కేసు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన భార్యాభర్తలు ఒకరిపైనొకరు దాడి చేసుకోగా ఇద్దరిపై కేసు నమోదైంది. స్థానిక ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దంపతులు ఎండీ.ఇలియాస్, రైసాబాను మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. రైసాబాను ఇలియాస్‌ను ఈ నెల 14న రాడ్‌తో కొట్టి గాయపర్చింది. ఇలియాస్ ఫిర్యాదు మేరకు ఆమెపై కేసు నమోదైంది. ఈ నెల 18న ఇలియాస్ రైసాబానుపై సుత్తితో దాడి చేసి గాయపర్చాడు. తీవ్రంగా గాయపడిన ఆమె వరంగల్‌లో ఎంజీఎంలో చికిత్స పొందింది. శుక్రవారం ఫిర్యాదు చేయగా ఇలియాస్‌పై కేసు నమోదైంది. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



పట్టుబడిన మద్యంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

కోటపల్లి: మంచిర్యాల నుంచి మహారాష్ట్రకు కారులో అక్రమంగా మద్యం తరలిస్తున్న కిరణ్‌ను మండలంలోని సిర్సా గ్రామ సమీపంలో టాస్క్‌ఫోర్స్ సీఐ రాజుకుమార్, ఎస్సై లచ్చన్న పట్టుకున్నారు. రూ.40వేలు విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. మద్యం బాటిళ్లు, కార్‌ను సీజ్ చేసి ఎస్సై రాజేందర్‌కు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

సర్టిఫికెట్లు ఇవ్వాలని హైకోర్టు ఆదేశం

భైంసా: బాసర ఆర్జీయూకేటీ పూర్వ విద్యార్థి సామల ఫణికుమార్ ఒరిజినల్ సర్టిఫికెట్స్ సోమవారంలోగా ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. 2023లో యూనివర్సిటీలో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తిచేసిన ఫణికుమార్ సర్టిఫికెట్ల కోసం ఏడాదిన్నరకాలంలో బాసర క్యాంపస్‌తోపాటు అక్కడి అధికారుల చుట్టూ తిరిగాడు. ఫీజు చెల్లించనిదే సర్టిఫికెట్లు ఇవ్వలేమని అధికారులు తెలుపడంతో చివరకు హైకోర్టును ఆశ్రయించాడు. ప్రభుత్వం విద్యాసంస్థలకు చెల్లించాల్సిన ఫీజు రియంబర్స్‌మెంట్ ఆపిందని విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం సరికాదని హైకోర్టు స్పష్టం చేసింది. సోమవారం సర్టిఫికెట్లు అందజేసి మంగళవారం కోర్టుకు సమాచారం ఇవ్వాలని ఆదేశించింది.

గల్ఫ్ బాధితులకు భరోసా

- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం
- ఉమ్మడి జిల్లాకు రూ.90 లక్షలు మంజూరు



గల్ఫ్ మృతులకు పరిహారం ఇతర అంశాలపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో గత నెలలో సమావేశమైన గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులు(ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన కార్మికులు అనుకోని ప్రమాదాలు, అనారోగ్య కారణాలతో అక్కడే తుదిశ్వాస విడిస్తే మృతదేహాలు రావడానికి సైతం వారి కుటుంబీకులు నెలల తరబడి వేచిచూసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. యజమానిపై ఆధారపడిన కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. ఈ నేపథ్యంలో గల్ఫ్‌దేశాల వెళ్లి మృత్యువాత పడుతున్న వలస కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులు ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం వలస కార్మికులకు భరోసానిచ్చేలా మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం గంతలోనే ఉత్తర్వులు ఇచ్చింది. ఈమేకు నిధులను తాజాగా విడుదల చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు రూ.90 లక్షలు మంజూరు కాగా, నిర్మల్ జిల్లాకు రూ.50 లక్షలు, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలకు రూ.20 లక్షల చొప్పున తొలి విడుదల నిధులను మంజూరు చేసింది.

ఉమ్మడి జిల్లాలో గల్ఫ్ గాయాలెన్నో...

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి గల్ఫ్ దేశాల్లో దాదాపు 60 వేల మంది వరకు ఉపాధి పొందుతున్నట్లు గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఉపాధి కోసం విదేశాల బాట పడుతున్నారు. ప్రమాదాల బారినపడి మృతి చెందుతున్నారు. దీంతో స్వగ్రామాల్లో వారి కుటుంబీకులు దిక్కుతోచని స్థితిలో జీవనం గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో కార్మిక సంఘాల నాయకులు కేరళ తరహా ఎన్ఆర్ఐ పాలసీ అమలు చేయాలని కోరుతూ వచ్చారు. గత నెలలో గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులతో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. పూర్తి వివరాలను నివేదిక రూపంలో స్వీకరించారు. ప్రజాభవన్‌లో కూడా ప్రవాసీ ప్రజావాణి పేరిట ప్రత్యేకంగా ఫిర్యాదుల విభాగాన్ని ప్రారంభించారు. ప్రతీ మంగళవారం, శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గత శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు కొన్ని నెలల క్రితం జీవో 205 విడుదల చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం 2023 డిసెంబర్ 7 తర్వాత గల్ఫ్ దేశాల్లో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షలు అందించనున్నారు.

ఎక్స్‌గ్రేషియా నిధుల విడుదల...

2023 డిసెంబర్ 7 నుంచి ఇప్పటి వరకు గల్ఫ్‌దేశాల్లో 160 మంది తెలంగాణ కార్మికులు మృతి చెందినట్లు అంచనా వేస్తున్నారు. ముఖమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లింపు కోసం తెలంగాణ ప్రభుత్వ జీఏడీ ఎన్నారై విభాగం ఈనెల 21న రూ.6.45 కోట్లు వివిధ జిల్లాలకు విడుదల చేసింది. ఇందులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు రూ.90 లక్షలు కేటాయించారు.

మృతుల కుటుంబాలకు ఊరట..



ఉపాధి కోసం ఎడారి దేశాలకు వలస వెళ్లి అక్కడ వివిధ కారణాలతో మృత్యువాత పడుతున్న ఘటనలు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కనిపిస్తాయి. మృతుల కుటుంబాలకు తక్షణ పరిహారంగా అందించాలని కోరుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని రూ.5 లక్షల చొప్పున ఆర్థిక చేయూతనివ్వడం హర్షనీయం.

– మంద భీమ్‌రెడ్డి, తెలంగాణ గల్ఫ్‌కార్మిక సంఘం నాయకులు

దయనీయ స్థితిలో కుటుంబాలు..



ఉపాధి కోసం ఎడారి దేశాలబాట పడుతున్న గల్ కార్మికులు ఎందరో విగత జీవులుగా స్వస్థలాలకు వస్తున్న దయనీయ దృశ్యాలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కనిపిస్తాయి. కొన్నిసార్లు మృతదేహాల కోసం నెలల తరబడి వేచి చూశారు. ఇలాంటి దయనీయ పరిస్థితుల్లో మృతుల కుటుంబాలకు ప్రభుత్వం బాసటగా నిలిచింది.

– స్వదేశ్ పరికిపండ్ల, ప్రవాసీమిత్ర కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



మహదు మృతదేహం

గుడిహత్నూర్: మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన కుమ్ర మహదు(45) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మహదు భార్య మూడేళ్ల క్రితం అతడిని వదిలి వెళ్లిపోయింది. ఈ క్రమంలో అతడు మద్యానికి బానిసయ్యాడు. గురువారం సాయంత్రం ఇంటి సమీపంలో మద్యం మత్తులో పురుగుల మందుతాగి పడిపోయాడు. గుర్తించిన స్థానికులు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి రాత్రి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యా ప్తు చేస్తున్నట్లు ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ తెలిపారు.

కుటుంబ కలహాలతో ఒకరు..

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధి బట్టిసావర్‌గాం శివారులో పురుగుల మందు తాగి అక్కినపల్లి ఆనంద్ (35)ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. భీంపూర్ మండలం ధన్నోరా గ్రామానికి చెందిన ఆనంద్‌కు లహరి(జమున)తో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. ఆనంద్ గ్రామంలో ఆర్ఎంపీగా పనిచేస్తున్నాడు. భార్యభర్తల మధ్య ఏడాదిగా కుటుంబ కలహాలు చోటుచేసుకున్నాయి. శుక్రవారం కూడా గొడవ జరిగి భార్య పుట్టింటికి వెళ్లింది. మనస్తాపం చెందిన ఆనంద్ ఆదిలాబాద్‌లో పురుగుల మందు కొనుక్కొని బట్టిసావర్‌గాం శివారుకు వెళ్లి తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన మరణానికి బావమర్దులు నరేశ్, బానయ్యతోపాటు భార్యతో వివాహేతర సంబంధం ఉన్న ఊశన్న కారణమని చనిపోయే ముందు సెల్ఫీ వీడియోలో పేర్కొన్నాడు. మృతుడి తండ్రి తులసీరాం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



వ్యక్తి మృతదేహం

తాండూర్: మండలంలోని రేచినీ రోడ్ రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని మంచిర్యాల జీఆర్‌పీ పోలీసులు తెలిపారు. 50 నుంచి 55 ఏళ్లలోపు వయస్సు ఉంటుందని, ఉదయం 7గంటల ప్రాంతంలో ఘటన జరిగిందని పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలియరాలేదని, పసుపు రంగు చొక్కా, గ్రేకలర్ నైట్‌ప్యాంటు ధరించి ఉన్నాడని తెలి పారు. రెండు చేతులపై పచ్చబొట్లు ఉన్నాయని, వివరాలు తెలిసిన వ్యక్తులు 8712580664 నంబరులో సంప్రదించాలని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

వేధింపులు తాళలేక ఒకరు..

రెబ్బెన(ఆసిఫాబాద్): వేధింపులు తాళలేక రెబ్బెన మండల కేంద్రానికి చెందిన రాంటెంకి వెంకటేశ్ (48) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. రెబ్బెన మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ షాపులో పనిచేస్తున్న వెంకటేశ్‌కు భూమి విషయంలో సమీప బంధువైన వైరగాడే పుష్పతో పరిచయం ఏర్పడింది. ఇద్దరు తరు చూ మాట్లాడుతూ ఉండటంతో పరిచయం వివాహేతర సంబంధంగా మారింది. ఈ విషయం సంవత్సరం క్రితం వెంకటేశ్ భార్య విజయకు తెలిసి పంచాయితీ పెట్టడంతో అతడు సదరు మహిళతో మాట్లాడటం మానేశాడు. తనతో మాట్లాడకుంటే చనిపోతానని పుష్ప బెదిరించడంతో వెంకటేశ్ మళ్లీ మాట్లాడటం ప్రారంభించాడు. పుష్ప తమ్ముడు డోంగ్రి వెంకటేశ్, భర్త బానయ్యతో పాటు మేనత్తలు రాంటెంకి వెంకటేశ్ ఇంటికి వచ్చి చంపుతామని బెదిరించారు. మరోసారి పుష్ప భర్త వెంకటేశ్‌కు ఫోన్ చేసి బెదిరించాడు. వీరి వేధింపులు తాళలేక రాంటెంకి వెంకటేశ్ ఈ నెల 24న రాత్రి గుర్తు పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు మొదట మంచిర్యాలకు.. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో శుక్రవారం వరంగల్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎ స్సై తెలిపారు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి



విజయలక్ష్మి(ఫైల్)

భీమారం: మండల కేంద్రానికి చెందిన వివాహిత మచ్చ విజయలక్ష్మి(31) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం సా యంత్రం మృతిచెందింది. ఎస్సై శ్వేత తె లిపిన వివరాల ప్రకారం.. గత కొన్ని రోజు లుగా కడుపునొప్పి, థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్న విజయలక్ష్మి జీవితంపై విరక్తితో గురువారం ఇంట్లోనే గడ్డిమందు తాగింది. కుటుంబీకులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో చనిపోయింది. మృతురాలి సోదరుడు రాజబాపు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


వాగులోపడి యువకుడు మృతి



రాజారత్నం(ఫైల్)

కుభీర్: మండలంలోని సాంవ్లి వద్ద గురువారం సాయంత్రం ఓ యువకుడు వాగులో పడి మృతిచెందాడు. ఎస్సై పి.రవీదర్ తెలిపిన వివరాల ప్రకారం .. తానూర్ మండలం ఎల్వి గ్రామానికి చెందిన అవధూత్ రాజారత్నం సాంవ్లిలోని ఉండే తన పెద్దమ్మ సరోజ ఇంటికి నాలుగు రోజుల క్రితం వచ్చాడు. గురువారం ఉదయం తన సోదరుడు సందీప్‌తో కలిసి కట్టెల కోసం సమీపంలోని అడవిలోకి వెళ్లారు. సాయంత్రం 4 గంటల సమయంలో వాగు వద్దకు స్నానం చేసేందుకు వెళ్లారు. రాజారత్నం వాగులో దిగి మునిగిపోయాడు. శుక్రవారం ఉదయం గాలించగా మృతదేహం లభించింది. రాజారత్నం తండ్రి గంగాధర్ ఫిర్యాదు మేరక కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అమెరికాలో ఖానాపూర్ యువతి ప్రతిభ



అమెరికాలో కిడ్నీ వీక్ ప్రదర్శనలో పాల్గొన్న యువతి

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన కట్కం స్వరూపరాణి–వేణుగోపాల్ దంపతుల కూతురు నిహారిక అమెరికాలోని 'యూట' యూనివర్సిటీలో న్యూట్రిషన్, డైటీషన్స్‌పై పీహెచ్‌డీ చేస్తోంది. కిడ్నీపై రీసెర్చ్‌లో భాగంగా ఈ నెల 24న కాలిఫోర్నియాలో జరిగిన కిడ్నీ వీక్ ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచి కడ్నీస్టార్‌గా అవార్డుతోపాటు 1500 అమెరికా డాలర్లు ప్రోత్సాహకంగా అందుకుంది. మైసూర్‌లో ఎమ్మెస్సీ చదివిన నిహారిక గోల్డ్ మెడల్ అందుకుంది. తాజాగా అమెరికాలో ప్రతిభ కనబర్చింది.

రోడ్డు ప్రమాదంలో కార్మికులకు గాయాలు



గాయపడిన సతీశ్, శ్రీకాంత్

కాసిపేట: కాసిపేట జాతీయ రహదారిపై కల్వరీ మినిస్ట్రీ చర్చీ ముందు ఆగి ఉన్న స్కూల్ బస్సును మోటార్‌సైకిల్ ఢీకొన్న సంఘటనలో సింగరేణి కార్మికులు పోతురాజుల సతీశ్, వేల్పుల శ్రీకాంత్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. మందమర్రి ఏరియా కాసిపేట 2గనిలో విధులు నిర్వర్తించే కాసిరెడ్డిపల్లికి చెందిన సతీశ్, బెల్లంపల్లికి చెందిన శ్రీకాంత్ రాత్రి విధులు ముగించుకుని మోటార్‌సైకిల్‌పై శుక్రవారం ఉదయం ఇంటికి వెళ్తున్నారు. చర్చి ముందు సోమగూడెం పాతబస్తీ వద్ద స్కూల్ వ్యాన్ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. సతీశ్‌కు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. శ్రీకాంత్ మంచిర్యాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా, ఇంకా ఫిర్యాదు అందలేదని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుడిహత్నూర్: మండలంలోని డొంగర్‌గావ్ వద్ద గల జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంద్రవెల్లి మండలం గిర్నూర్‌కు చెందిన రాథోడ్ కైలాస్ (49)మృతి చెందాడు. కైలాస్ పని నిమిత్తం శుక్రవారం వేకువజామున కాలినడకన జాతీయ రహదారి గుండా మన్నూర్ వైపు వెళ్తున్నాడు. అతివేగంగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ తెలిపారు.

గుండంపల్లి రైతులకు పరాభవం

- చిత్తనూర్ ఫ్యాక్టరీ సందర్శనకు పయనం..
- మార్గంమధ్యలో అడ్డుకున్న పోలీసులు



రైతులను బస్సులో ఇతర ప్రాంతానికి తరలిస్తున్న పోలీసులు

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల నడుమ నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా మండలంలో కొంతకాలంగా రెండు గ్రామాల రైతులు రిలే దీక్షలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఇతర ప్రంతాల్లోని ఫ్యాక్టరీలను సందర్శించి పరిస్థితులను తెలుసుకుందామని గుండంపల్లి గ్రామానికి చెందిన 100 మంది రైతులు గురువారం రాత్రి రెండు బస్సుల్లో నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూరుకు వెళ్లారు. అయితే మార్గం మధ్యలోనే రెండు బస్సులను పోలీసులు అడ్డుకున్నారు. రైతులను అదుపులోకి తీసుకున్నారు. చిత్తనూరు రైతులు, గ్రామస్తులను కలవకుండా దారి మళ్లించారు. దీంతో రైతులు నిరాశగా వెనుదిరిగారు. రైతులను అణచివేస్తే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.

పర్యావరణం కోసం సైకిల్ యాత్ర



ముధోల్‌లో సైకిల్ యాత్రికుడు

ముధోల్: పర్యావరణ హితం.. పరిరక్షణే తన అభిమతమని చాటుతూ తమిళనాడుకు చెందిన అన్బూ చార్లెస్ 60 ఏళ్ల వయసులో సైకిల్ యాత్ర చేపట్టారు. శుక్రవారం ఈ సైకిల్‌యాత్ర ముధోల్ మండల కేంద్రానికి చేరింది. ఆయన తిరిగే ప్రతీచోట ప్రజలతో పాటు పాఠశాల విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్నారు. ముధోల్‌లోనూ పర్యావరణం ఎలా దెబ్బతింటుంది, కారణాలు ఏమిటి, భవిష్యత్‌లో మానవ మనుగడకు పర్యావరణాన్ని ఎలా సంరక్షించాలి అనే అంశాలను వివరించారు.

27న జోనల్‌స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు

మంచిర్యాలఅర్బన్: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 27న మంచిర్యాలలోని జెడ్పీ హైస్కూల్ మైదానంలో అండర్–14, 17 విభాగం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలబాలికల బాస్కెట్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఫణిరాజా తెలిపారు. క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో పోటీల కన్వీనర్ సుకుమార్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

జిల్లా స్థాయి వుషూ పోటీలు..

జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 27న సీసీసీలోని ఆదిత్య స్కూల్‌లో అండర్–17 బాలబాలికల జిల్లా స్థాయి వుషూ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు క్రీడల ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఫణిరాజా తెలిపారు. జనవరి 1, 2008 తర్వాత జన్మించిన విద్యార్థులు అర్హులని, పాఠశాల కోచ్ శివమహేష్‌ను సంప్రదించాలని తెలిపారు.

గొర్రెను చంపిన కొండచిలువ



గొర్రెను పట్టేసిన కొండ చిలువ

కడెం: మండలంలోని పెద్దూర్ గ్రామానికి చెందిన గోపు మల్లేశ్ గొర్రెను కడెం ప్రాజెక్టు వద్ద శుక్రవారం కొండచిలువ చంపేసింది. రోజూలాగానే ప్రాజెక్టు దిగువన గొర్రెలను మేపుతుండగా పక్కనే ఉన్న కాలువ ఒడ్డు నుంచి వచ్చిన కొండచిలువ గొర్రెను చుట్టుకుంది. గొర్రె అరుపులతో ఘటన స్థలానికి చేరుకున్న కాపరి కొండచిలువను చూసి ఆందోళన చెందాడు. అయితే అప్పటికే గొర్రె చనిపోయింది. స్థానికులు ఘటన స్థలానికి చేరుకుని కొండచివలను రాళ్లతో కొట్టడంతో అది అక్కడి నుంచి కాలువలోకి వెళ్లిపోయింది.

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనంలో అపశ్రుతి

- మంటలు ఎగసిపడి పలువురికి గాయాలు



పాండురంగ్‌ను పరామర్శిస్తున్న గజేందర్

బజార్‌హత్నూర్: ఆదిలాబాద్ సభలో సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ పరుష పదజాలంతో దూషించడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. మండల కేంద్రంలో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. అయితే దిష్టిబొమ్మపై పెట్రోల్ పోస్తున్న క్రమంలో మంటలు ఎగసిపడి అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు జల్కే పాండురంగ్, పోరెడ్డి నారాయణ, పాశవు వెంకటరమణ, కానిస్టేబుల్ మోహన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. ఇందులో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మల్లేపూల నర్సయ్య, విఠల్, శివుడు, రాజు, నందకుమార్, నారాయణ, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉమ్మడి జిల్లా గురుకుల క్రీడా పోటీలు

- ఓవరాల్ చాంపియన్‌గా మందమర్రి జట్టు



ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన మందమర్రి జట్టు

ఆదిలాబాద్: జిల్లాకేంద్రంలోని మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల పాఠశాల, కళాశాలలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి క్రీడాపోటీలు శుక్రవారం ముగి శాయి. ప్రిన్సిపాల్ ఎస్. కీర్తి మాట్లాడుతూ, క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లోనూ సత్తా చాటాలని ఆకాంక్షించారు. కబడ్డీలో గన్నవరం జట్టు, ఖోఖోలో మందమర్రి జట్టు, వాలీబాల్‌లో ఆదిలాబాద్ జట్లు నిలిచాయి. ఇండివిజువల్ చాంపియన్‌షిప్ కే. మౌనిక (గన్నవరం) సొంతం చేసుకోగా, ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను మందమర్రి జట్టు కైవసం చేసుకుంది. ఈ వేడుకల్లో జైనథ్, ఆసిఫాబాద్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు ఉమాదేవి, రతన్ బాయి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా హాకీ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీడీ వసంత్‌రావు

ఉట్నూర్‌రూరల్: ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా బాలురు అండర్–14,17 హాకీ పోటీలను ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్ మైదానంలో శుక్రవారం ప్రారంభించారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వసంత్‌రావు, ఐటీడీఏ ఈఈ రాథోడ్ భీంరావు పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఇందులో జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, రమేశ్, ప్రధానోపాధ్యాయులు రాథోడ్ ఉత్తం, హేమంత్, కోచ్‌లు రవీందర్, శేఖర్, శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వీడని పులి భయం

- వజ్జర్ అటవీప్రాంతంలోకి బెబ్బులి
- ఆందోళనలో సమీప గ్రామాల ప్రజలు



బోథ్: మండలవాసులను పులి భయం వీడడం లేదు. మూడు రోజులుగా మండల పరిధిలోని పలుగ్రామాలను వణికించిన బెబ్బులి శుక్రవారం వజ్జర్ అటవీప్రాంతలోకి ప్రవేశించింది. ఈ మేరకు వ్యవసాయ పనులు నిర్వహిస్తున్న స్థానిక రైతులకు మధ్యాహ్నం 3.30గంటల సమయంలో కనిపించింది. వారంతా వెంటనే కేకలు వేస్తూ పరుగెత్తారు. కాగా మూడు రోజులుగా చింతలబోరి, చింతగూడ, నేరేడుపల్లి, రెండ్లపల్లె గ్రామాల్లో కనిపించిన పులి తాజాగా వజ్జర్ అటవీప్రాంతంలోకి చేరినట్లు తెలుస్తోంది. దీంతో సమీపంలోని లెండిగూడ, మహాదుగూడ, కేశవ్‌గూడ, జైతుగూడ, నాగుగూడ గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే వజ్జర్ నుంచి పులి మహారాష్ట్రలోకి తిరుగు ప్రయాణం అయ్యే అవకాశముందని అటవీ అధికారులు పేర్కొన్నారు.